# 16

## త్రై నే నె గి ం డి

ఈ వ్యవహారంలో తప్పంతా కవిదే అంటాను.

కవిగాబట్టి అతడు కావ్యం రాయటంలో తప్పేమీ లేదు. రాశాక దాన్ని అచ్చులో చూసుకోవాలని వాంఛించటంలోనూ తప్పు లేదు. ప్రక్కింటి షావుకారుగార్ని 'అచ్చు వేయించిపెట్టండి' అని అడగటంలోనూ తప్పు లేదు.

ఆయన 'నేను వేయించను' అన్నప్పుడు ఆయనమీద కత్తిగట్టడం మాత్రమే తప్పు. 'కత్తి' కాదు కడత, 'కలం'. తన కలంతో షావుకారు పైన కసిదీర్చుకోబోయాడు కవి.

అతడు ఇరవైమూడో నెంబరు అద్దెకొంపలో కాపురం ఉండేవాడు. షావుకారుగారు ఇరవై

రెండో నెంబరు సొంత మేడలో నివసిస్తూండేవాడు. ఈ కొంపకు పేరేమీ లేదు. ఆ మేడగేటుకి 'లక్ష్మీ నివాస్' అని అక్షరాలు చెక్కిన రాతిపలక అతికించివుంది.

కవి బక్కపలచగా, పొడుగ్గా వుంటాడు.జుట్టులో వున్న పుష్టి దేహంలో లేదు. షావుకారు పొట్టిగా, లావుగా వుంటాడు. దేహంలోవున్న పుష్టి జుట్టులో లేదు.

కవికి ఒక కలం వుంది; తెల్లకాగితాలున్నాయి. షావుకారుగారికి ఇనప్పెట్టెనిండా పచ్చకాగితాల కట్టలున్నాయి.

కవిభార్య తెల్లటి కోటామిల్లుచీర కట్టుకుంటుంది. నగలు లేక తెల్లకాగితానికిమల్లేనే వుంటుంది. కవి కాగితంమీద అక్షరాలు నింపగలిగేడేకాని ఆమెకు అలంకారాలు తేలేక పోయాడు. ఆమె ఆ ఊసు తెస్తే తన పద్యాలు చదివి, 'ఇది రూపకాలంకారం,ఇది ఉపమాలంకారం'అంటూ తెలియజెప్పేవాడు. చెప్పేడు కాని, షావుకారుగారి భార్య వంటిమీదవుండే అలంకారాలు కవిభార్యను ఆకర్షించినట్లు ఈ అలంకారాలేమీ ఆకర్షించలేదు. కవికి ఆవిడే చెప్పింది సలహా. "మీరు రాసిన కావ్యాన్ని షావుకారుకు కృతిఇచ్చి, ఏ వెయ్యిన్నూటపదహార్లో సంపాదించి నాకు నగలు చేయించండీ' అని. ఆవిడే వెళ్ళి షావుకారుగారి భార్యతో నేస్తంకలిపి,వాళ్ళ వంశవివరాలన్నీ అప్పుడూ అప్పుడూ తెలుసుకొచ్చింది. ఆ వివరాలు ఆధారంగా తీసుకొని కవి, 'రవిగానని'విషయాలెన్నో (లేనివి) తాను చేర్చి 'కృతిపతి వంశావళి' తయారుచేశాడు. షావుకారుగారు తీరికగావున్న ఒకరోజున తన కావ్యం పుచ్చుకుని,

కృతిపతికి వినిపించా లన్న తలంపుతో 'లక్ష్మీ నివాస్' మేడ మీాదికి వెళ్ళేడు.

ఆ పుస్తకం తనకి కృతిఇవ్వబడినదని షావుకారుకు మొదట తెలవలేదు. ఏమంటే, కవిగారు కృతిపతికి హఠాత్తుగా ఆ సంగతి తెలియజేసి ఆశ్చర్యసంభ్రమసంతోషాదులు కలుగ జేసి కార్యం నెరవేర్చుకోవాలని చూశాడు. 'వంశావళి' చదువుతోంటే విని సంగతి గ్రహించి ఉబ్బిపోతాడు షావు కారు అని ఆశించాడు కవి. కాని జరిగిన పొరబా టేమిటంటే, 'అచ్చమ్మ' అన్న పేరును (షావుకారు నాయనమ్మ పేరు అచ్చమ్మ) 'అచ్చమాంబ' అనీ, 'రాజయ్య' అనే నామాన్ని రాజయాఖ్యుడనీ మార్చటం జరిగి, షావుకారు పోల్చుకోలేక పోయాడు. ఒక డజను పద్యాలు చదవటం అయాక కవి షావుకారు కేసి, 'ఎలాగున్నాయి?' అన్నట్లు చూశాడు.

షావుకారు, "పద్యాలు మాంచిపసందుగా చదవగలవు పంతులూ నువ్వు! సినిమాలో చేరకపోయావ్?" అన్నాడు.

కవిమనస్సు చివుక్కుమంది. తాను చేసిన పొరబాటు తళుక్కుమని గోచరించి, ఆ పద్యాలన్నీ తనే రాశాననీ, అవన్నీ షావుకారుకీర్తిని శాశ్వతం చెయ్యటానికే అనీ వివరించి, మళ్ళీ ఒక్కొక్క పద్యమే చదివి వ్యాఖ్యానంచేసి చెప్పేడు.

"నన్నూ, నా తండ్రి తాతలనూగురించి ఈ బ్రాహ్మడు ఇన్ని అబద్ధాలు ఎందుకు చెప్పినట్లు? అంతేకాక యేడాది జమా ఖర్చులు రాసుకోడానికి సరిపడ్డ తెల్లకాగితాలను ఈ పద్యా లతో నలుపుచేసి ఎందుకు పాడుచేసినట్లు?" అని ఆలోచించి,

కనిపెట్టేసి ముందుజాగ్రత్తలో పడ్డాడు ఆయనంతట ఆయనే, 'అచ్చు వేయిస్తాను, అని పుచ్చుకొని, సన్మానానికొక సభ యేర్పాటు ఆశించిన కవికి ఆశాభంగం కలిగింది. షావుకారు డి ప్రసంగం ఆ ధోరణిలో రాకపోవటం చూసి, కవి కొచ్చి ముంతదాచటం ఎందు కింక?' అని నిశ్చయించుకుని కృతిపతులు గాన దీన్ని తమరు అచ్చువేయించి నాకు తగిన సన్మానం జరపాలి!'' అని మనవిచేశాడు.

షావుకారు, ''అయ్యబాబో, అచ్చువేయించటమే! కాగితంధర ఎలావుందో తెలుసా పంతులూ? పదిరెట్లు పెరిగి పోయింది! అందుకేగా పాత కేటలాగులన్నీ ఐపోయినా, కొత్తవి అచ్చువేయించటం మానేశాను?'' అన్నాడు.

కవి ఏమిచెయ్యాలో తోచక దిక్కులు చూస్తోంటే షావుకారు, ''పంతులూ, నువ్వు మాంచి రాతగాడవు కనక ఈమాటు మా కేటలాగు నువ్వు రాసిపెడుదుగాని! ఊరికే గాదులే, ఏదో ముట్టచెప్పకపోను!'' అంటూ లేచి, స్నానానికని పెరట్లోకి చక్కాపోయాడు.

ఈ విధంగా కవి చిత్తు ఐపోయి, షావుకారుచేత చిత్తు కాగితాలకన్నా హీనంగా చూడబడ్డ తన వ్రాతప్రతిని చేత బుచ్చుకుని, 'ఇమ్మనుజేశ్వరాధముల' అనే పోతనగారి పద్యాన్ని స్మరించుకుంటూ, మెల్లిగా మెట్లు దిగి తనకొంపకు తిరిగి వచ్చాడు.

భార్య, ''ఏమండీ, అలాగున్నారేం?'' అంది.

ఈ ప్రశ్నతో అతనిలో బయలు మూఁత విడిపోయి, శాపనార్థాల రూపంగ చక్కా వచ్చింది. "వెయ్యేన్నాళ్ల పదహార్లు డనుకున్నావు! జిలేబీగోలుసు చేయించుకుని కులుకు కున్నావు కాదూ?" అని ప్రారంభించి, "ఎద్దుకేం తెలు అటుకులరుచి!" అంటూ ప్రవాహాన్ని పక్కింటివైపు పోని "కేటలాగు రాసిపెట్టాలిట రాస్కెలుకి!" అంటూ కూలబ పోయాడు.

ఎక్కడ కనబడ్డా షావుకారు కవిని పలకరిస్తూనే ఉన్నాడు. కాని కవి కోపంగా మొహం తిప్పేసుకు పోయే వాడు. జగ్గకవి చేసినట్లు తనుకూడా 'వంశావళి' అంతా తిరగరాసి షావుకార్ని ఏడిపించా లన్న ఆలోచన తోచింది కవికి. ఒక స్నేహితుడితో సంప్రదించగా, అతడు చెప్పిన దేమి టంటే, " 'పద్యాలు అర్థం కాలేదు షావుకారికి!' అని కదా అంటున్నావు? అటువంటప్పుడు, భూషణా, దూషణా ఒకేలాగ నిష్ప్రయోజకా లౌతాయి. ఎందుకూ మళ్లీ కాగితాల దండుగ?" అని.

కాని కవికి కసిపోలేదు. గ్రామ్యభాషలో షావుకారుని తిడుతూ కథరాసి, ఏ పత్రికలోనో అచ్చువేయా లనిపించిం దతనికి. పట్టుదలగా అంతపనీ చేశాడు కవి. కాని షావుకారు సరకుల ధరలు తెలుసుకోవటానికి ఒక్క దినపత్రిక తప్ప, మరే కథలపత్రికలూ కొనడు. కవి రాసిన కథను షావుకారు చదువుకుని ఏడ్చుకోవడం ఎలా మరి? ఈ ఆలోచనతో కవి

మళ్లీ కొంత శ్రమించవలసి వచ్చింది. ఆలోచించగా ఆలోచించగా ఒక ఉపాయం తట్టింది.

షావుకారుకు ఒకే ఒక కూతురుంది. ఆమె బళ్ళోకి వెడుతుంది. ఆమె చదివే క్లాసులోనే కవిస్నేహితుని కూతురు ఐన ఒక అమ్మాయికూడా చదువుతోంది. ఆ అమ్మాయి బళ్ళోకి వెడుతూండగా ఎదురై కవి తనురాసిన కథగల సచిత్ర మాసపత్రికను ఆపిల్ల కిచ్చి, 'చదువు. మంచికథలున్నాయి. కావాలంటే మా పక్కింటి షావుకారుపిల్ల ఉంది చూడూ, నీ స్నేహితురాలు, ఆమెకుకూడా ఇయ్యి'' అన్నాడు.

ఆమె పుస్తకం ఉచితంగా వచ్చిందని సంతోషించిందే గాని అందులో గూడుపుఠాణీ చాలా ఉందని ఆమె కేం తెలుసు? షావుకారుగారి అమ్మాయి పత్రికచేత ఆకర్షింపబడి తనే అడిగిపుచ్చుకుని ఇంటికి తెచ్చుకుని సావకాశంగా చదువుకుంది.

ఆ కథపేరు 'ఎద్దు కేం తెలుసు అటుకుల రుచి?' అని. అందులో 'ఎద్దు' తన తండ్రి అనీ, 'అటుకులు' పక్కింటి కవి రాసి తెచ్చిన పద్యాలనీ ఆ పిల్లా, ఆ పిల్ల తల్లీ సులభంగానే గ్రహించగలిగేరు. కథకుడిపేరు స్పష్టంగా కనపడుతూనేవుంది గనక, ఆ కథ షావుకారుమీదేనని వాళ్ళిద్దరికీ తెల్లమై ఆ నల్లంటి మొఖాలు కోపంతో ఎర్రబడ్డాయి. షావుకారు రావటంతోనే కథసంగతి చెప్పేరు.

వెంటనున్న గుమాస్తాగారు సంగతి విని, ''మానసష్టానికి కేసుపెట్టండి. కవిగాడి పొగరణిగిపోతుంది!'' అన్నాడు.

షావుకారు నవ్వుకుని, "ఇతగాడికోసం కోర్టుకెక్కి డబ్బు తగలపెడతాంటోయ్! ఏనుగుని చూసి ఎన్నికుక్కలు మొరగవుగనక? మనం లక్ష్యపెట్టకపోవటమే దీనికి సరియైన మందు!" అని ఊరుకున్నాడు.

కాని కవి మళ్లీ షావుకారుమీద ఇంకొక కథ రాసి, ఈమారు పత్రికను ఎవరూ చూడకుండా కిటికీలోంచి షావుకారుగారి ఇంట్లో పడేసి చక్కావచ్చాడు. ఆకథ చదువుకుని షావుకారుగారి భార్యా, కూతురూ 'ఇలా రాస్తాడా?' అని కోపం కక్కుతూంటే వినపడి, కవి, 'కలమే నెగ్గిం'దన్న సంతోషంతో ఎగిరి గంతేశాడు. మూడోకథను 'కలమే నెగ్గింది!' అన్న శీర్షికతో రాసి, ఇదివరకుమల్లేనే షావుకారుగారింట అందజేశాడు.

షావుకారుకు ఈమారు కోపంవచ్చింది. ఐతేం, ఆయన కోర్టుకు పోలేదు; కవిని పిలిచి చివాట్లుపెట్టలేదు; ఎవరిచేతా పెట్టించనూ లేదు. కోపంమాత్రం తగ్గలేదు.

రెండురోజులు గడిచాయి. మూడోరోజు ఉదయం, ద్వారంవద్ద ఎవరో నిలబడి, 'సార్' అన్నాడు.

షావుకారు సావిట్లోకి వెళ్ళి, 'ఎవరు, ఏంకావాలి?' అంటూ ప్రశ్నించాడు.

ఆ వచ్చినాయన, "మాది ముమ్మిడివరమండీ. నేను సంగీతం మేష్టర్ని. ఈవూరు కొత్తగా వచ్చాను. తమలాంటి వారిని నలుగుర్ని దర్శనం చేస్తున్నాను. మీకు చదువుకునే

అమ్మాయి ఉన్నదని విని సంగీతం చెప్పిస్తారేమోనని వచ్చాను" అన్నాడు.

షావుకారు "మా పిల్లకంఠం నగలు వేసుకునేదేగాని, సంగీతం వచ్చే కంఠం గాదు" అంటూ మేష్టర్ని పంపేశాడు. కాని ఏం తోచిందో గేటుదాకా వెళ్ళిన మేష్టర్ని మళ్ళీ వెనక్కి పిలిచి, 'కూర్చో' మని కుర్చీ చూపేడు. "మీరు సంగీతం చెపుతే నెలకి యేం పుచ్చుకుంటారు?"

"రోజు విడిచి రోజు వస్తాను. నెలకి పదిహేనురూపాయ లిప్పించండి."

"రోజు విడిచి రోజు కాదు. ప్రతిరోజూ ఉదయమే రావాలి. నెలకు ఇరవై రూపాయ లిస్తాను."

మేష్టరు తొలిబేరం పోగొట్టుకోకూడదని, వొప్పు కున్నాడు. ఆ మర్నాటి ఉదయమే షావుకారు కుమార్తెకు సంగీతపాఠం ప్రారంభమైంది.

అదేసమయానికి ప్రక్కింటి కవి, కాగితంపైన కలం పెట్టేడు. కాని ఒక్క అక్షరం కూడా రాయలేకపోయాడు. షావుకారు కిటికీలోంచి గమనిస్తూనే వున్నాడు. మేష్టరు గంట సేపు షావుకారుగారి అమ్మాయిచేత సరిగమలు సాగదీయించి వెళ్ళిపోయాడు.

'బ్రతుకుజీవుడా!' అని కవి మళ్ళీ రాత ప్రారంభిం చాడు. షావుకారు అది కనిపెట్టి, పిల్లను పిలిచి, "మేష్టరు వెళ్ళిపోవడంతోనే నువ్వు తుర్రుమనకూడదు. సాధకం చేసు

కోవాలి!'' అన్నాడు. ఆమె సాధకం మొదలెట్టింది! కవి కలం ఆగిపోయింది!

షావుకారు కుమార్తెతో ఏం చెప్పేడో మరి! కవి కాగితంమీద కలంపెట్టినప్పుడల్లా ఆయన కాపిల్ల సాధకం వినపడటం, ఆయన కలం ఆగిపోవటం జరిగేది.

అవి వేసంగి శెలవులు. ఆ పిల్లకి రెండునెలల దాకా బడికి వెళ్లనవసరంలేదు. పొద్దస్తమానం సాధకం చెయ్యొచ్చు! వారంరోజులు సాధకం జరిగేసరికి కవికి తన బుర్రలోని నరాలు తెగిపోతాయనిపించింది. అతడు ఎక్కడో మరో ఇల్లు చూసు కుని, మానుబండి ఒకటి తెప్పించి సామాను పట్టించుకు వెళ్ళి పోయాడు.

పోతూంటే షావుకారు చిరునవ్వుతో ఎదురై, ''పంతులూ, ఈమాటు 'త్రాసే నెగ్గింది!' అన్న కథ రాయి'' అంటూ చక్కాపోయాడు. ఆ మర్నాడే సంగీతం మేష్టరుకి అక్కడికైన జీతం లెక్కచూసి ఇచ్చేసి, మానిపించేశాడు.